తెలుగు దినపత్రిక
ప్రభాత
jayabheridaily.com
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
సంపుటి : 01
సంచిక : 54
పేజీలు : 4
వెల : 4
మల్కాజిగిరి
సోమవారం, 04-09-2023

జయభేరి దినపత్రిక, జయభేరి ఛానల్‌లో
నిఖార్సైన జర్నలిస్టులుగా నిలబడాలనుకుంటున్నారా?
అన్ని తరహా వార్తలు.. కథనాలు...
ఎలాంటి ఆంక్షలు లేకుండా రాయాలనుకుంటున్నారా?
మీ కలాలకు పదును పెట్టండి....
విలేకర్లు కావలెను
ఆసక్తి కలిగిన యువతి యువకులకు అవకాశం
అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత
email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com
9391 544 889 call me

## ఒకే దేశం ఒకే ఎన్నికలతో రాష్ట్రాలపై దాడి



**జయభేరి, న్యూఢిల్లీ, సెప్టెంబర్ 3 :**
ఈ నెల 18న పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలకు కేంద్ర పిలుపునివ్వడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో 'ఒకే దేశం ఒకే ఎన్నికలు' అంశంలోని సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు కేంద్రం ఓ కమిటీని ఏర్పాటు చేయడంతో ఊహాగానాలు మరింత పెరిగాయి. ఇప్పుడు దేశంలో చర్చంతా ఈ వన్ నేషన్ వన్ ఎలక్షన్పైనే! తాజాగా ఈ వ్యవహారంపై మౌనం వీడారు కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ. ఒకే దేశం ఒకే ఎన్నికలకు వ్యతిరేకంగా ట్వట్ చేశారు. "ఇండియా, అంటే భారత్, అంటే రాష్ట్రాల ఐకమత్యం. ఒకే దేశం ఒకే ఎన్నికల ఆలోచనతో ఇండియన్ యూనియన్తో పాటు రాష్ట్రాలపై దాడి చేస్తున్నారు," అని ట్వీట్ చేశారు రాహుల్ గాంధీ. పార్లమెంట్ స్పెషల్ సెషన్లో వన్ నేషన్ వన్ ఎలక్షన్ అంశాన్ని మోదీ ప్రభుత్వం ప్రస్తావిస్తుందో లేదో ఇంకా క్లారిటీ లేదు. హోంమంత్రి అమిత్ షా, మాజీ ఎంపీ గులామ్ నబీ ఆజాద్, మాజీ ఆర్థికమంత్రి ఎన్కే సింఘ్, లోక్సభ మాజీ సెక్రటరీ జెనరల్ సుభాష్ సీ కశ్యప్, సీనియర్ అడ్వకేట్ హరీశ్ సాల్వే, మాజీ చీఫ్ విజిలెన్స్ కమిషనర్ సంజయ్ కథారీలు ఉన్నాయి. కమిటీలో సభ్యుడిగా చేరాలన్న ప్రతిపాదనను కాంగ్రెస్ నేత అధీర్ రంజన్ చౌదరి తిరస్కరించారు. సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో, కొద్ది నెలల సమయంలో ఇలా చట్టలను మార్చేందుకు కమిటీలను వేయడం సరైన విషయం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ ఏడాది నవంబర్ డిసెంబర్ మధ్యలో మిజోరం, మధ్యప్రదేశ్, ఛత్తీస్గఢ్, తెలంగాణ, రాజస్థాన్లలో ఎన్నికలు జరగనున్నాయి. ఏప్రిల్జూన్ మధ్యలో లోక్సభ, ఆంధ్రప్రదేశ్, ఒడిశ, సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్లో ఎన్నికలు జరగాల్సి ఉంది. ఇక్కడ ఒక విషయాన్ని ప్రస్తావించాలి. 1967లో లోక్సభతో పాటు అన్ని రాష్ట్రాల ఎన్నికలు ఒకేసారి జరిగాయి.



2 లో

# అసమ్మతి నేతలతో పెద్ద చిక్కు!

## బీఆర్ఎస్ అభ్యర్థులపై నిఘా నీడ

## ఎమ్మెల్యే ఈటల కు తప్పిన ప్రమాదం





**జయభేరి, హైదరాబాద్ :**
బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ కు తృటిలో ప్రమాదం తప్పింది. కరీంనగర్ జిల్లా మానకొండూరు మండలం లలితాపూర్ గ్రామం వద్ద ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ప్రయాణిస్తున్న వాహనానికి ప్రమాదం జరిగింది. చీకటి పడడంతో ఎదురుగా వస్తున్న గొర్రెల మందను చూసి డ్రైవర్ అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో వెనక వస్తున్న ఎస్కార్ట్ వాహనం ఈటల వాహనాన్ని ఢీ కొట్టింది. దీంతో ఈటల ప్రయాణిస్తున్న వాహనం స్వల్పంగా దెబ్బతింది. భగవంతుని దయ, ప్రజల ఆశీస్సులతో అందరం క్షేమంగా ఉన్నామని ఈటల రాజేందర్ తెలిపారు. ప్రమాదానికి గల కారణాలు తెలుసుకోకుండా కొందరు వ్యక్తులు వారికి నచ్చినట్టు సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారన్నారు. దయచేసి ఆ వార్తలను పట్టించుకోవద్దని ఈటల రాజేందర్ కోరారు.

## జమిలి ఎన్నికల కమిటీ సభ్యులు వీరే..

దేశవ్యాప్తంగా అన్ని అసెంబ్లీలకు, లోక్ సభకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలన్న కేంద్రం ఆలోచిస్తోంది. ఈ దిశగా సిఫారసులు చేయడానికి ఇప్పటికే మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ నేతృత్వంలో ఒక కమిటీని ఏర్పాటు చేసింది. తాజాగా, శనివారం, ఆ కమిటీ సభ్యుల పేర్లను వెల్లడిస్తూ ఒక నోటిఫికేషన్ విడుదల చేసింది.

**ఈ కమిటీకి మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ నేతృత్వం వహిస్తారు. కమిటీలో..**
1. అమిత్ షా (కేంద్ర హోం మంత్రి)
2. అధిర్ రంజన్ చౌధరి (కాంగ్రెస్ నేత, ఎంపీ)
3. గులాం నబీ ఆజాద్ (జమ్మూకశ్మీర్ నేత)
4. ఎన్ కే సింగ్ (15వ ఆర్థిక సంఘం మాజీ చైర్మన్)
5. సుభాష్ చంద్ర కశ్యప్ (లోక్ సభ మాజీ సెక్రటరీ జనరల్)
6. హరీశ్ సాల్వే (సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది)
7. సంజయ్ కొఠారీ (మాజీ చీఫ్ విజిలెన్స్ కమిషనర్)

సభ్యులుగా ఉంటారు.
ఈ కమిటీ తక్షణమే విధుల్లోకి దిగుతుందని, జమిలి ఎన్నికలకు సంబంధించి సాధ్యమైనంత త్వరగా సిఫారసులతో కూడిన నివేదికను ఇస్తుందని న్యాయ శాఖ తెలిపింది. ఈ కమిటీ సమావేశాలకు ప్రత్యేక ఆహ్వానితుడిగా కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ హాజరవుతారు. అలాగే, ఈ కమిటీ సెక్రటరీగా న్యాయ శాఖ కార్యదర్శి నితిన్ చంద్ర వ్యవహరిస్తారు. దేశవ్యాప్తంగా అన్ని అసెంబ్లీలకు, లోక్ సభకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించడంపై సాధ్యాసాధ్యాలను, అడ్డంకులను, సమస్యలను ఈ కమిటీ అధ్యయనం చేస్తుంది. ఇందుకు అవసరమైన రాజ్యాంగ సవరణలపై, ప్రత్యేకంగా చట్టాలేమైనా చేయాలా? అనే విషయంపై సిఫారసులు చేస్తుంది. రాజ్యాంగంతో పాటు ఏయే చట్టాల్లో, ఏయే మార్పులు చేయాలో సూచిస్తుంది. గడువుకు ముందే సభ రద్దైతే ఏం చేయాలి?.. హంగ్ సభ ఏర్పడితే ఎలాంటి చర్యలు తీసుకోవాలి?.. అవిశ్వాస తీర్మానం గెలిస్తే భవిష్యత్ కార్యాచరణ ఎలా ఉండాలి?.. పార్టీ ఫిరాయింపులపై ఎలాంటి నిర్ణయాలుండాలి?.. మొదలైన అంశాలను కూడా ఈ కమిటీ అధ్యయనం చేస్తుంది.



## తెలంగాణలో కీలక రైల్వే ప్రాజెక్టులు

- ఆదిలాబాద్ నుంచి పటాన్చెరువు వరకు కొత్త రైలు మార్గం
- వికారాబాద్-కృష్ణా మధ్య కొత్త రైల్వే లైన్
- వరంగల్ నుంచి గద్వాల వరకు కొత్త రైల్వే లైన్
- ఉందానగర్ నుంచి జగ్గయ్యపేట వరకు కొత్త రైల్వే లైన్
- ఆర్ఆర్ఆర్ చుట్టూ ఔటర్ రింగ్ రైల్వే ప్రాజెక్ట్

**తెలుగు రాష్ట్రాల ప్రజలకు కేంద్రం గుడ్ న్యూస్ చెప్పింది. ఏపీ, తెలంగాణ మధ్య కొత్త రైల్వే ప్రాజెక్టులను ప్రకటించింది. కేంద్రమంత్రి, తెలంగాణ బీజేపీ చీఫ్ కిషన్‌రెడ్డి కొత్త రైల్వే ప్రాజెక్టుల వివరాలను ఆదివారం వెల్లడించారు.**



**జయభేరి, హైదరాబాద్ :**
తెలంగాణకు సంబంధించి ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల ప్రజల దశాబ్దాల నాటి ఆకాంక్షలను రైల్వే శాఖ తీర్చనుంది. ఆదిలాబాద్, ఇచ్చోడ, నేరడిగొండ, నిర్మల్, బాల్కొండ, ఆర్మూర్, బోధన్, బాన్సువాడ, నిజాంపేట్, సంగారెడ్డి మీదుగా పటాన్‌చెరు వరకు కొత్త రైల్వే లైన్ ఏర్పాటుచేస్తుంది. ఈ ప్రాజెక్టులో నార్త్ తెలంగాణను హైదరాబాద్, ముంబయి, నాగ్‌పూర్ మీదుగా దిల్లీ మార్గంతో అనుసంధానం చేయనున్నారు. ఈ ప్రాజెక్టుతో ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్ ఆర్థికాభివృద్ధితో పాటు వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్‌కు తరలించేందుకు రైతులకు వీలవుతుంది. ఈ ప్రాజెక్టు మొత్తం పొడవు 317 కి.మీ కాగా, అంచనా వ్యయం సుమారు రూ. 5,706 కోట్లు అని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. మరో ప్రాజెక్టు దక్షిణ తెలంగాణ ప్రాంతాలు ఉమ్మడి వరంగల్ జిల్లా, డోర్నకల్ నుంచి కూసుమంచి, పాలేరు, మోతే, సూర్యాపేట, నల్గొండ, కల్వకుర్తి, నాగర్ కర్నూల్, వనపర్తి మీదుగా గద్వాల్ వరకు రైల్వే మార్గం ఏర్పాటుచేస్తారు. ఉమ్మడి ఖమ్మం, నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాల్లోని ముఖ్యమైన ప్రాంతాలను కొత్త రైల్వే లైన్ ద్వారా అనుసంధానిస్తారు. ఈ ప్రాంతాల నుంచి కాటన్ ఎగుమతి, బియ్యం రవాణా, గ్రానైట్ తరలింపునకు నూతన రైల్వే లైన్ ఎంతగానో ఉపయోగపడుతుందని కిషన్ రెడ్డి తెలిపారు. సింగరేణి కాలరీస్ నుంచి కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాలను అనుసంధానించడంతో వాణిజ్య అవసరాలకు ఈ మార్గం ఉపయోగపడుతుందన్నారు. ఈ ప్రాజెక్టు మొత్తం పొడవు 296 కి.మీ కాగా, అంచనా వ్యయం సుమారు రూ.5,330 కోట్లు అని కిషన్ రెడ్డి ప్రకటించారు.

**హైదరాబాద్, అమరావతి మధ్య**
మరో కీలకమైన ప్రాజెక్టు కాచిగూడ (ఉందానగర్) నుంచి జగ్గయ్యపేట రంగారెడ్డి జిల్లా మీదుగా చిట్యాల, నకిరేకల్, మునుగోడు, సూర్యాపేట, జగ్గయ్యపేట నియోజకర్గాలను అనుసంధానిస్తూ కొత్త రైల్వే లైన్ ఏర్పాటుచేస్తున్నారు. విజయవాడకు వెళ్లే జాతీయ రహదారికి సమాంతరంగా ఈ ప్రాజెక్టు ఉంటుంది. తెలంగాణ రాజధాని హైదరాబాద్, ఏపీ అమరావతిలను కలిపేందుకు అతి తక్కువ దూరం రైల్వే మార్గం ఇది కాబోతుందని కిషన్ రెడ్డి తెలిపారు. ఈ ప్రాంతంలో ప్రజారవాణా, వాణిజ్య అవసరాలు, సిమెంట్ ప్లాంట్లకు నూతన కొత్త లైన్ ద్వారా లబ్ధి జరుగుతుందన్నారు. ఈ ప్రాజెక్టు పొడవు 228 కి.మీ కాగా, అంచనా వ్యయం సుమారు రూ.4,104 కోట్లు అని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రాజెక్టులకు తెలంగాణ ప్రభుత్వం సహకరించట్లేదని కిషన్ రెడ్డి ఆరోపించారు. త్వరలో సికింద్రాబాద్‌బెంగళూరు మధ్య వందే భారత్ రైలును ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. కేంద్ర ప్రాజెక్టుల భూసేకరణకు బీఆర్ఎస్ ప్రభుత్వం సహకరించాలని ఆయన కోరారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పార్కింగ్‌కు భూమి కేటాయించాలని అడిగితే రాష్ట్ర ప్రభుత్వం స్పందించలేదన్నారు. చర్లపల్లి కనెక్టివిటీ రోడ్డుకు కూడా రాష్ట్రం స్పందించలేదన్నారు. వచ్చే ఏడాది చర్లపల్లి రైల్వే టెర్మినల్ ప్రారంభిస్తామన్నారు. యాదాద్రి ఎంఎంటీస్‌తో సహా పలు రైల్వే ప్రాజెక్టులకు రాష్ట్ర ప్రభుత్వం సహకరించట్లేదని ఆరోపించారు.

## ఓరుగల్లులో గాడితప్పిన ఫ్రెండ్లీ పోలీసింగ్..!?

- ఓ దళిత యువకుడిని చితకబాదిన మట్టెవాడ పోలీసులు
- ఎంజీఎంలో చికిత్స పొందుతున్న బాధితుడు జన్ను ఆనందరావు..
- కుటుంబంలో చిన్న తగాదతో తోబుట్టువు 100కు డయల్ చేయడమే పోలీసులు చితకబాదటానికి కారణం...!
- ఘటన పట్ల ఆవేదన చెందుతున్న బాధితుని సోదరడుడు జన్ను కిరణ్...
- న్యాయం కోసం వేడుకోలు...
- ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధపడుతున్న బాధితుని సోదరుడు
- సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై శాఖాపరమైన చర్యలు చేపట్టాలని ప్రజాసంఘాల డిమాండ్



2 లో

ప్రభాత
జయభేరి
jayabheridaily.com

# అసమ్మతి నేతలతో పెద్ద చిక్కు!

**జయభేరి, హైదరాబాద్ :**

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్..115 స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించారు. అయితే ఎన్నికలు సమీపిస్తున్న కొద్ది మార్పుచేర్పులు జరిగే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. దీంతో బీఆర్ఎస్ అభ్యర్థుల పరిస్థితి ముందునుయ్యి వెనుకగొయ్యి అన్నచందంగా మారింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా పదమూడు నియోజకవర్గాల్లో వేములవాడలో చల్మెడ లక్ష్మీనరసింహరావును,కోరుట్లలో ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు తనయుడు డాక్టర్ సంజయ్, హుజురాబాద్ నియోజకవర్గంలో పాడికౌశిక్ రెడ్డిని మిగిలిన నియోజకవర్గాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలకే టికెట్లు ఖరారు చేస్తూ సీఎం కేసీఆర్ జాబితా విడుదల చేశారు. దీంతో నియోజకవర్గాల వారీగా అభ్యర్థులంతా ర్యాలీలు, ప్రచారాలు చేస్తూ ప్రజలతో మమేకమై సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. మరోవైపు నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల పనితీరు, వ్యవహారశైలి, ప్రజలకు వారిపై ఉన్న అభిప్రాయం.. ఇలా ఇంటెలిజెన్స్ వర్గాలు ఎప్పటికప్పుడు ఆరాతీస్తున్నాయని సమాచారం. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులపై గ్రామ గ్రామాన ప్రైవేట్ సర్వేలు నిర్వహిస్తున్నారని తెలుస్తోంది. తమ నియోజకవర్గానికి కేటాయించిన అభ్యర్థి సరైన వారేనా లేక ఇంకెవరినైనా కోరుకుంటున్నారా అన్న కోణంలో సర్వేలు కొనసాగుతున్నాయి. మరో మూడు నెలల్లో ఎన్నికలు రానున్న నేపథ్యంలో ఇప్పటికే ప్రకటించిన అభ్యర్థుల పనితీరుపై ఎప్పటికప్పుడు నివేదికలు ఇంటెలిజెన్స్ వర్గాలు అధినేతకు చేరవేస్తున్నట్టు సమాచారం. అయితే చివరి వరకు అందిన నివేదికల్లో తమ జాతకాలు ఎలా ఉంటాయోనని...ప్రతికూలంగా ఉంటే అభ్యర్థులను మార్చాల్సి వస్తుందని మీడియా సమక్షంలో కేసీఆర్ చేసిన హెచ్చరికలతో అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు.

తెలంగాణ ఏర్పడిన నాటి నుంచి ఉద్యమంలో పనిచేసిన వారు, ఇతర పార్టీల నుంచి అధినేత హామీల మేరకు పార్టీలోకి వచ్చిన వారితోనే అసలు సిసలైన అసమ్మతి ఎదుర్కోవాల్సివస్తుంది. టికెట్లు ఆశించి భంగపడ్డవారు, బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థులపై తిరుగుబావుటా ఎగురవేసిన వారు కొందరైతే, పార్టీ వీడిన వారు మరికొందరు....ఇలా నియోజకవర్గాల వారిగా పరిశీలిస్తే సగానికి పైగా అసమ్మతి అభ్యర్థులకు కంటిమీద కునుకులేకుండా చేస్తుంది. వేములవాడ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్న ఏనుగు మనోహర్ రెడ్డికి టికెట్ కేటాయించకుండా చల్మెడ లక్ష్మీనరసింహరావుకు కేటాయించడంపై నియోజకవర్గంలో అసమ్మతి జడలు విప్పింది. కాంగ్రెస్ పార్టీలో ఎమ్మెల్యే అభ్యర్థి స్థాయిలో ఉన్న తనను కేసీఆర్ బీఆర్ఎస్ లో చేర్చుకున్నారని...ఇన్ని సంవత్సరాలుగా నియోజకవర్గంలో పార్టీకి తన వంతు కృషి చేసిన తనను కాదని చల్మెడకు టికెట్ ఇవ్వడంపై గుర్రుగా ఉన్నారు. పెద్దపల్లి నియోజకవర్గంలో బీఆర్ఎస్ యువనేత నల్లమనోహర్ రెడ్డి ఇప్పటికే బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి రెబల్ గా బరిలో ఉంటానని ప్రకటించారు. చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ కు వ్యతిరేకంగా ఎంపీపీలు, పలువురు ప్రజాప్రతినిధులు పావులు కదుపుతున్నారు. ప్రతి నియోజకవర్గంలో తీవ్ర స్థాయిలో ఇంటిపోరు ఉండగా ఏ రకంగా భయటపడతామోనని అభ్యర్థులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. ముందస్తుగానే అభ్యర్థులను ప్రకటించగా సంబరాలు చేసుకుంటే సరికాదని బీ ఫారాలు తమ చేతికి వచ్చేంత వరకు కూడా నమ్మకం ఉండదని అనుచరులతో అభ్యర్థులు బాహాటంగానే చెబుతున్నారు. ఓ వైపు ప్రైవేట్ సర్వే, మరోవైపు ఇంటెలిజెన్స్ ఆరా...ఇంకో వైపు అసమ్మతి ఇలా దినదినగండంగా మారిందని ఏ నిమిషానికి ఏం జరుగుతుందోనని ఏ సర్వేలు తమకు ప్రతి కూలంగా వచ్చే అవకాశాలున్నాయో అలాంటి అంశాలపై అభ్యర్థులు ఎక్కువ దృష్టి సారిస్తున్నారు.



# రెచ్చిపోయిన ప్రేమోన్మాది

## ఇంట్లోకి చొరబడి అక్కాతమ్ముడిపై కత్తితో దాడి!

**జయభేరి, హైదరాబాద్ :**

హైదరాబాద్ ఎల్బీనగర్ లో దారుణం చోటుచేసుకుంది. పట్టపగలు ఇంట్లోకి చొరబడిన దుండగుడు యువతి, ఆమె తమ్ముడిపై కత్తితో దాడికి పాల్పడ్డాడు. ముందుగా చింటు (20)పై విచక్షణ రహితంగా దాడి చేశాడు దుండగుడు. ఆ దాడిని అడ్డుకునేందుకు వెళ్లిన అక్క సంఘవిపై కూడా కత్తితో దాడి చేశాడు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన చింటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. యువతి ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. అయితే సంఘవి హోమియోపతి చదువుతున్నట్లు తెలుస్తోంది. షాద్ నగర్ కు చెందిన యువతి గత కొంతకాలంలో ఎల్బీనగర్ లో నివాసం ఉంటుంది. ఆదివారం ఇంట్లో వీరిద్దరూ ఉండగా దుండగుడు కత్తితో దాడి చేశాడు. యువతి కేకలతో స్పందించిన స్థానికులు దుండగుడిని పట్టుకుని ఓ ఇంట్లో నిర్భందించారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో... సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. ఈ దాడికి ప్రేమ వ్యవహారమే కారణమని స్థానికులు అనుమానిస్తున్నారు. ఈ దుశ్చర్యకు పాల్పడిన వ్యక్తి ఎవరు? ఎందుకు దాడి చేశాడనే విషయాలు ఇంకా తెలియాల్సి ఉంది.

సంఘవి, ఆమె తమ్ముడు చింటుపై శివకుమార్ అనే యువకుడు కత్తితో దాడి చేశాడు. ఇంట్లో అక్కా, తమ్ముడి ఉన్న సమయంలో ఇంట్లోకి వచ్చిన యువకుడు వారిద్దరిపై కత్తితో విచక్షణా రహితంగా దాడి చేశాడు. ఈ దాడిలో తీవ్రగాయాల పాలైన యువతి తమ్ముడు చింటు(20) మృతి చెందాడు. యువతి తీవ్రంగా గాయపడగా ఆమెను స్థానికులు ఆసుపత్రికి తరలించారు. ఇంట్లోకి శివకుమార్ కత్తితో రావడంతో యువతి, ఆమె తమ్ముడు గట్టిగా కేకలు వేశారు. దీంతో స్థానికులు దాడికి పాల్పడిన యువకుడిని ఓ గదిలో బంధించి పోలీసులు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు దాడికి పాల్పడిన శివకుమార్ ను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కత్తి పోట్లతో తీవ్రంగా గాయపడిన యువతి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఈ దాడికి ప్రేమ వ్యవహారమే కారణమని తెలుస్తోంది. షాద్‌నగర్‌కి చెందిన యువతి సంఘవి ప్రస్తుతం హోమియోపతి చదువుతోంది. ఎల్బీనగర్‌లో నివాసం ఉంటున్న యువతి సంఘవిని శివకుమార్ అనే యువకుడు గత కొంతకాలంగా ప్రేమిస్తున్నాడు. తనను పెళ్లి చేసుకోవాలని యువతిపై ఒత్తిడి తెస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం యువతి ఇంటికి వచ్చిన శివకుమార్ ప్రేమ వ్యవహారం గురించి తేల్చాలన్నాడు. పెళ్లి చేసుకోవాల్సిందిగా సంఘవిపై ఒత్తిడి తెచ్చాడు. అయితే పెళ్లి చేసుకునేందుకు ఆమె నిరాకరించింది తన వెంట తెచ్చుకున్న కత్తితో యువతి, ఆమె తమ్ముడిపై దాడికి దిగాడు. ఈ దాడిలో యువతి తమ్ముడు మృతి చెందాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

# సీతారామచంద్ర స్వామి ఆలయ విగ్రహ ప్రతిష్టకు పూర్తైన ఏర్పాట్లు

## ఆదివారం నాడు జల, క్షీరాధి వాసం క్రతువు ల్లో పెద్ద ఎత్తున పాల్గొన్న స్థానిక మహిళలు



**జయభేరి, పాలకుర్తి, సెప్టెంబర్ 03 :**

జనగామ జిల్లా, పాలకుర్తి మండలం వాల్మీకిపురంగా చెప్పుకునే వల్మిడి గ్రామంలో అత్యంత వైభవోపేతంగా, అంగరంగ వైభవంగా శ్రీ సీతారామ చంద్ర స్వామి ఆలయ విగ్రహ ప్రతిష్ట మరియు ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ముఖ్యమంత్రి కేసిఆర్ ముఖ్యఅతిధిగా, శ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వాముల వారి చేతుల మీదుగా 4 వ తేదీ, సోమవారం నాడు యంత్ర ప్రతిష్ట, విగ్రహ ప్రతిష్ట, ధ్వజస్థంబ ప్రతిష్ట అనంతరం మహాకుంభాభిషేకం, కుంభ ప్రోక్షణ, తొలిపూజ, విశేష అర్చన, తీర్థప్రసాద వితరణ జరుగనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి మంత్రులు హరీష్ రావు, ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరన్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, స్థానిక నేతలు, ఇతర ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, ప్రజలు హాజరవనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వం తరుపున వాల్మికి స్వగ్రామంగా తెలిపే వల్మిడి శ్రీసీతారామచంద్ర ఆలయానికి 51 కోట్లు, పాలకుర్తి ఆలయానికి 16 కోట్లు, బమ్మెర పోతన ప్రాంగణాభివృద్ధికి 4 కోట్లు, వానకొండయ్య నరసింహ స్వామి ఆలయానికి 2 కోట్లు, చెన్నూరు త్రికూటాలయానికి, సన్నూరు వెంకటేశ్వర ఆలయాభివృద్ధికి 20 కోట్లతో పాటు భక్తుల సౌకర్యార్థం 25 కోట్లతో పాలకుర్తి టూరిజం హోటల్ నిర్మాణానికి కేటాయించిన ముఖ్యమంత్రి కేసిఆర్, జిల్లామంత్రి దయాకర్ రావులకు ప్రజలు, స్థానికులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నారు.



# సింగరేణి ప్రాంతంలో గులాబీ జెండా ఎగరాలి

**వచ్చే ఎన్నికల్లో ఢంకా మోగించి అన్ని ఎమ్మెల్యే స్థానాలను గెలిపించి కెసిఆర్ కి కానుకగా ఇవ్వాలి**

**సింగరేణి ప్రైవేటీకరణను అడ్డుకున్న ఘనత కేసిఆర్ ది**

**ప్రైవేటీకరణ నుంచి తప్పించి సింగరేణి సీఎం కెసిఆర్ కాపాడారు**

**సింగరేణి పాఠశాలల కాంట్రాక్ట్ టీచింగ్ మరియు నాన్ టీచింగ్ సిబ్బంది సమావేశంలో కల్వకుంట్ల కవిత**




**జయభేరి, హైదరాబాద్ :**

రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో సింగరేణి ప్రాంతాల్లో గులాబీ జెండా ఎగరాలని, ఆ ప్రాంతాల్లో ఉన్న అన్ని ఎమ్మెల్యే స్థానాలను గెలిపించి సీఎం కేసీఆర్ కు కానుకగా ఇవ్వాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విజ్ఞప్తి చేశారు. సింగరేణి సంస్థకు చెందిన పాఠశాలల్లో కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తున్న టీచింగ్ మరియు నాన్ టీచింగ్ సిబ్బంది తమ సమస్యలను పరిష్కరించాలంటూ ఆదివారం నాడు హైదరాబాదులో కల్వకుంట్ల కవితను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ.... సింగరేణిని ప్రైవేటీకరించే పరిస్థితి నుంచి సీఎం కేసీఆర్ తప్పించారని తెలిపారు. ప్రైవేటీకరణను తీవ్రంగా వ్యతిరేకించి ఆ సంస్థను కాపాడారని చెప్పారు. ఆర్టీసీ సంస్థను కూడా ప్రైవేటీకరణ చేయకుండా ప్రభుత్వంలో విలీనం చేసిన ఘనత సీఎం కేసీఆర్ కే దక్కుతుందని తేల్చి చెప్పండి. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న సమస్యలను రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కెసిఆర్ ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ వస్తున్నారని అన్నారు. తెలంగాణ రాకముందు వారసత్వ ఉద్యోగాల అంశం తీవ్రమైన సమస్యగా ఉండేదని, అప్పట్లో కేవలం 4000 ఉద్యోగాలు మాత్రమే ఇస్తే తెలంగాణ ఏర్పడిన తర్వాత 20 వేల ఉద్యోగాలు కల్పించాలని స్పష్టం చేశారు. మానవతా దృక్పథంతో ఆలోచించి సీఎం కేసీఆర్ వారసత్వం ఉద్యోగాలను కల్పించారని చెప్పారు. అదే రకంగా సింగరేణి సంస్థలోని పాఠశాలల టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగుల సమస్యలను కూడా ప్రభుత్వం సానుకూలంగా పరిష్కరిస్తుందని హామీ ఇచ్చారు. అవసరమైతే సింగరేణి కార్మిక నాయకులతో సీఎంతో సమావేశం ఏర్పాటు చేయించడానికి ప్రయత్నం చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ జనరల్ సెక్రెటరీ మిరియాల రాజిరెడ్డి మరియు టీబీజీకేస్ నాయకులు పాల్గొన్నారు.

# ఓరుగల్లులో గాడితప్పిన ఫ్రెండ్లీ పోలీసింగ్...!?

- ఓ దళిత యువకుడిని చితకబాదిన మట్టెవాడ పోలీసులు
- ఎంజీఎంలో చికిత్స పొందుతున్న బాధితుడు జన్ను ఆనందరావు..
- కుటుంబంలో చిన్న తగాదతో తోబుట్టువు 100కు డయల్ చేయడమే పోలీసులు చితకబాదటానికి కారణం...!
- ఘటన పట్ల ఆవేదన చెందుతున్న బాధితుని సోదరడుడు జన్ను కిరణ్...
- న్యాయం కోసం వేడుకోలు...
- ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసేందుకు సిద్దపడుతున్న బాధితుని సోదరుడు
- సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై శాఖాపరమైన చర్యలు చేపట్టాలని ప్రజాసంఘాల డిమాండ్





**జయభేరి వరంగల్ సెప్టెంబర్ 3:**

రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నడిబొడ్డున అర్ధరాత్రి పూట సాక్షాత్తూ ప్రజల మాన, ప్రాణాలు కాపాడాల్సిన పోలీసులు వరలక్ష్మి అనే ఓ గిరిజన మహిళపై అమానవీయ రీతిలో దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటన జరిగిన పక్షం రోజులు దాటిందోలేదో వరంగల్ నగరం మట్టెవాడ పోలీసు స్టేషన్ పరిధి పోచమ్మ మైదాన్ లో పోలీసులు జన్ను ఆనందరావు (ఆనంద్) అనే ఓ దళిత యువకున్ని చితకబాదారు. ఆగస్టు 30వ తేదీన సుమారు రాత్రి 7:30 గంటల సమయంలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఘటన ఫ్రెండ్లీ పోలీసింగ్ గాడితప్పిందనడానికి మరోసారి సాక్ష్యంగా నిలుస్తోందని పలు ప్రజాసంఘాలు వ్యాఖ్యానిస్తున్నాయనేది గమనార్హం. హైదరాబాద్ లో గిరిన మహిళ వరలక్ష్మీ ఘటన మరువక ముందే వరంగల్ పోచమ్మ మైదాన్ లో దళిత యువకుడి పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు "ఫ్రెండ్లీ పోలీసింగ్ "కు మచ్చతెచ్చేలా ఉందనేది గమనార్హం.

**ఘటన వివరాలు విశ్వాసనీయ సమాచారం ప్రకారం**

వరంగల్ పోచమ్మ మైదాన్ లో జన్ను ప్రభాకర్ పద్మ దంపతుల కుటుంబం నివాసం ఉంటుంది. అయితే ప్రభాకర్ పద్మ ఇరువురూ అనారోగ్యంతో బాధపడుతున్నారు. పద్మ పక్షవాతంతో మంచాన పడింది. దీంతో చిన్న కుమారుడైన జన్ను ఆనందరావు తన తల్లి అయిన పద్మకు సేవలు చేస్తుంటాడు. ఇదే ఇంట్లో తన సోదరి కూడా ఉంటుంది. అయితే తల్లికి సేవలు చేసే క్రమంలో తన సోదరితో ఏర్పడిన చిరు తగాదాకు తన సోదరి 100కు డయల్ చేసింది. దీంతో మట్టెవాడ పోలీసులు ఇద్దరు వచ్చి బాధిత కుటుంబం ఇల్లు చేరుకొని జన్ను ఆనందరావు (ఆనంద్) ను చితకబాదినట్లు బాధితుని సోదరుడు జన్ను కిరణ్ తెలిపారు. పోలీసులు చితకబాదడంతో తన సోదరుడైన ఆనందరావు (ఆనంద్) స్పృహ కోల్పోయినట్లు సమాచారం అందిన వెంటనే కుటుంబ సభ్యులైన తమతో పాటు స్థానికులు ఆనంద్ ను స్థానిక ఎంజిఎం హాస్పిటల్ కు తరలించామని, ప్రస్తుతం ఎంజీఎంలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. తన సోదరుడు ఆనందరావు ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడని, పోలీసులు మరీ ఇంత దారుణంగా చితకబాదడం తమను ఆందోళనకు గురిచేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. సమగ్రమైన విచారణ జరిపి తగు చర్యలు చేపట్టాలని తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు. ఇట్టి ఘటనపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసేందుకు సిద్దపడుతున్నట్లు బాధితుని సోదరుడు జన్ను కిరణ్ "జన నిర్ణయం ప్రతినిధి"కి తెలిపారు. ఘటన వివరాలు తెలుసుకోవడానికి వివరణ కోసం జన నిర్ణయం ప్రతినిధి మట్టెవాడ సీఐ ని ఫోన్ లో సంప్రదించడానికి ప్రయత్నించగా ఫోన్ కు స్పందించలేదు. మరోవైపు ఈ ఘటన పట్ల సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై శాఖాపరమైన చర్యలు చేపట్టాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ హైదరాబాద్ లో గిరిన మహిళ వరలక్ష్మి ఘటన మరువక ముందే వరంగల్ పోచమ్మ మైదాన్ లో దళిత యువకుడి పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు "ఫ్రెండ్లీ పోలీసింగ్ "కు మచ్చతెచ్చేలా ఉందనేది గమనార్హం.



# సగం కాలిపోయిన మహిళ మృతదేహం రేప్ చేసి చంపేశారా?

**జయభేరి, ఉత్తర్ ప్రదేశ్ :**

ఉత్తర్ ప్రదేశ్లో మరో షాకింగ్ ఘటన వెలుగులోకి వచ్చింది. ఓ బాక్స్లో సగం కాలిపోయిన మహిళ మృతదేహం చూసి పోలీసులు షాక్ అయ్యారు. ఆమెను రేప్ చేసి, చంపేసి ఉంటారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఉత్తర్ ప్రదేశ్ భదోహిలోని జాతీయ రహదారి 19 లాల్ నగర్ టోల్ ప్లాజా వద్ద శనివారం సాయంత్రం ఈ ఘటన వెలుగుచూసింది. ఓ టిన్ బాక్స్ నుంచి వాసన వస్తోందని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి వెళ్లిన పోలీసులు.. ఆ టిన్ బాక్స్ను తెరిచి చూసి, ఒక్కసారిగా షాక్ అయ్యారు. అందులో ఓ మహిళ మృతదేహం కనిపించింది. ఆ శరీరం సగం కాలిపోయింది! ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మహిళ ముఖం గుర్తుపట్టలేని స్థితిలో ఉంది. దుండగులు.. ఆమెను మర్డర్ చేసే ముందు, తల నుంచి నడుము వరకు పెట్రోల్ పోసి నిప్పు అంటించి ఉంటారని అధికారులు అనుమానిస్తున్నారు. "చూస్తుంటే.. మహిళ వయస్సు 20ఏళ్లు ఉండొచ్చని అనిపిస్తోంది. ఆమె శరీరం నడుము భాగం వరకు కాలిపోయింది. ఆమె కాళ్లు తాడుతో కట్టి ఉన్నాయి. మర్డర్ చేసే ముందు పెట్రోల్ పోసి నిప్పు అంటించి ఉంటారు. ఫోరెన్సిక్ నిపుణులు, డాగ్ స్క్వాడ్.. ఘటనాస్థలానికి వెళ్లి పరీక్షలు చేపట్టాయి. ముందు అసలు ఆ మహిళ ఎవరో తెలుసుకోవాలి. ఆమె ఐడెంటిటీని కనుక్కునేందుకు చర్యలు తీసుకున్నాము. ఆమె తెల్లను డ్రెస్ ధరించింది," అని పోలీసులు మీడియాకు వివరించారు. అయితే.. మర్డర్కి ముందు రేప్ జరిగి ఉంటుందని అధికారులు అనుమానిస్తున్నారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించినట్టు, నివేదిక బయటకు వచ్చిన తర్వాత మరిన్ని వివరాలు తెలుస్తాయని స్పష్టం చేశారు. బాధితురాలిని గుర్తించిన తర్వాత, నిందితులను పట్టుకుని కఠినంగా శిక్షిస్తామని వెల్లడించారు. దేశంలో మహిళలపై నేరాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. వృద్ధులను కూడా విడిచిపెట్టడం లేదు! 85ఏళ్ల వృద్ధురాలిపై అత్యాచారం జరిగిన ఘటన తాజాగా దిల్లీలో కలకలం సృష్టించింది. బాధితురాలు.. ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో.. నిందితుడు చొరబడి, ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు.

# వైకాపా నేతల ఘర్షణ

**జయభేరి, గుడివాడ :**

గుడివాడ వైఎస్ఆర్ పార్టీ లో ఇరువురు నేతల మధ్య ఘర్షణ జరిగింది. సాక్షాత్తు మచిలీపట్నం పార్లమెంటు సభ్యులు బాలశౌరి సమక్షంలో వైఎస్ఆర్ పార్టీ కృష్ణాజిల్లా ఉపాధ్యక్షులు మండలి హనుమంతరావుకు ప్రైవేట్ బస్సు ఓనర్ వడ్లాని సుధాకర్ కు మధ్య జరిగిన తోపులాట జరిగి తీవ్ర ఉద్రిక్తలకు దారి తీసింది. ప్రస్తుతం సుధాకర్ కు చెందిన కారు నెహ్రూ చౌక్ సెంటర్లో వెళుతుండగా హనుమంతరావు వర్గానికి చెందిన కొందరు కారును ధ్వంసం చేశారు. అయితే కారులో సుధాకర్ లేకపోవడంతో హనుమంతరావు వర్గీయులు ఆగ్రహానికి లోనయ్యారు. విషయం తెలుసుకున్న పోలీసులు ధ్వంసమైన కారును గుడివాడ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. దీంతో గుడివాడలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

# వార్డు అధ్యక్షుడిని పరామర్శించిన ఎమ్మెల్యే చల్లా



**జయభేరి, పరకాల, సెప్టెంబర్ 3:**
పరకాల మున్సిపల్ 04 వ వార్డు బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు దామ అనిల్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ఈరోజు దామ అనిల్ ను పరామర్శించి అతని ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్న ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి వెంట మున్సిపల్ చైర్మన్ సోదా అనిత రామ కృష్ణ, వైస్ చైర్మన్ రేగూరి విజయపాల్ రెడ్డి, పట్టణ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు డా"మడికొండ శ్రీను, మున్సిపల్ 05 వ వార్డు కౌన్సిలర్ గొర్రె స్రవంతి రాజు, సమన్వయ కమిటీ సభ్యులు నిప్పాని సత్యనారాయణ, దామెర మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు గందు రాము తదితరులు పాల్గొన్నారు.

# జోరుగా బహుజన సమాజ్ పార్టీలో చేరికలు




**జయభేరి, వరంగల్, సెప్టెంబర్ 3:**
వరంగల్ లోని తూర్పు నియోజకవర్గంలో 14వ డివిజన్లో వరంగల్ తూర్పు నియోజకవర్గం ఇన్చార్జి పుష్పితలయ్య ఆధ్వర్యంలో బహుజన్ సమాజ్ పార్టీలో ఆదివారం రోజున జాయిన్ అవ్వడం జరిగింది. ఈ సందర్భంగా పుష్పితలయ్య మాట్లాడుతూ... ఆర్ఎస్పి ప్రవీణ్ కుమార్ ఆలోచన విధానం గత కాలంలో ఒక సోషల్ వెల్ఫేర్ సెక్రెటరీ గా ఉండి ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ పిల్లలు మంచిగా చదువుకోవాలని పిల్లలకు మంచి విద్యను అందించి పిల్లలను పెద్దపెద్ద యూనివర్సిటీ లకు కోడింగ్ భాషలను ఎంబిబిఎస్ డాక్టర్లను పైలెట్స్ ను నేవీలో ప్రపంచంలో అతి ఎత్తైన శిఖరాలను ఎక్కించుకుంటూ ఇలా గురుకుల పిల్లలు ఉన్నంత స్థాయిలో ఉండాలని ఇంకా మరెన్నో ఉన్నంత చదువులకు పోవాలని కృషి చేయడం జరిగింది ఇప్పుడు కూడా తన ఉద్యోగానికి రాజీనామా చేసి ప్రజలతో ప్రజల సమస్యలు తెలుసుకుంటూ ప్రజల్లో ఉంటున్నాడని వాళ్ళకి చెప్పడం జరిగింది. తూర్పు నియోజకవర్గం లో బహిరంగంగా ఇంకా చేరికలు జరుగుతాయి బిసి బిడ్డా పద్మశాలి బిడ్డా శ్రీరామోజు అరుణ్ కుమార్. ఎస్టి ఎరుకల బిడ్డ కుతాటి సాయికుమార్ ప్రజల సమస్యలు అనుచితం ప్రజల్లో ఉంటున్న నేను మరి నా యొక్క పనితనం నచ్చి జాయిన్ కావడం జరిగింది. అసెంబ్లీలో బహుజన జెండా ఎగిరే విధంగా అనుచితం ప్రజలతో ఉంటానని వరంగల్ తూర్పు నియోజకవర్గ ఇన్చార్జి పుష్పితలయ్య ఈ సందర్భంగా తెలియజేశారు.

# ముందస్తు అడుగులేనా

**జయభేరి, హైదరాబాద్ :**
**(విశ్లేషణ)**
డిసెంబర్ లో లోక్ సభకూ ఎన్నికలు జరిగే అవకాశం ఉందంటూ.. విస్తృతంగా జరుగుతున్న ప్రచారానికి బలం ఇచ్చేలా వరుసగా ఒక దాని తర్వాత ఒకటి పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. సెప్టెంబర్ 18 నుంచి 22 వరకూ పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు జరుగుతాయని కేంద్రం తాజాగా ప్రకటించింది. ఇటీవలే వర్షాకాల సమావేశాలు ముగిశాయి. విపక్షాలు అవిశ్వాస తీర్మానం పెడితే .. చర్చ కూడా జరిగింది. ఇప్పుడు మళ్లీ హఠాత్తుగా పార్లమెంట్ సమావేశాలు నిర్వహించడం చర్చనీయాంశమవుతోంది. డిసెంబర్ లో ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉంది. మళ్లీ ఏప్రిల్ లో ఆంధ్రప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం, ఒడిషా రాష్ట్రాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఇలా వరుసగా ఎన్నికలు జరుగుతూండటంతో ప్రజాధనం వృధా అవుతోందని.. మొత్తం తొమ్మిది రాష్ట్రాలతో పాటు పార్లమెంట్ ఎన్నికలు కూడా ఒకే సారి నిర్వహించాలన్న ఆలోచనకు కేంద్రం వస్తోందని చెబుతున్నారు. ఇందుకు సంబంధించిన ప్రక్రియ పూర్తి చేయడానికే పార్లమెంట్ సెషన్ నిర్వహిస్తున్నారని చెబుతున్నారు. ఎన్నికల సంఘం ఇప్పటికే పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు కూడా ఏర్పాట్లు పూర్తి చేసింది. పలు రాష్ట్రాల్లో తుది ఓటర్ల జాబితాను ఫైనల్ చేయడానికి ప్రయత్నిస్తోంది. కర్నాటక ఎన్నికల ఫలితంతోనే బీజేపీ పర్ స్పెక్టివ్ మారిపోయిందా . ఆ ఎన్నికల ఫలితం వెలువడడానికి ముందు వరకూ హ్యాట్రిక్ విజయంపై ఉన్న ధీమా బీజేపీలో ఇప్పుడు పూర్తిగా అడుగంటిందా? అంటూ పరిశీలకులు ఔననే విశ్లేషిస్తున్నారు. తమ విశ్లేషణలను అలంబనగా ఆ పార్టీ ఇటీవలి కాలంలో తీసుకుంటున్న నిర్ణయాలను ఎత్తి చూపుతున్నారు. ఎవరో తరుముకు వస్తున్నారన్నట్లుగా వరుసగా ప్రజాకర్షక కార్యక్రమాలను ప్రకటించేస్తున్నారు. ఇంత కాలం ధరల మోత గురించి పన్నెత్తి మాట్లాడని మోడీ ఇప్పుడు వరుసగా సామాన్యుడికి ఊరట కలిగేలా ధరల తగ్గింపుపై పడ్డారు. ముందుగా మధ్యతరగతికి గుదిబండగా మారిన గృహావసరాలకు వినియోగించే గ్యాస్ బండ ధరను రెండు వందల రూపాయల వరకూ తగ్గిస్తున్నట్లు ప్రకటించారు. తదుపరి ఆయన పెట్రో ధరలను తగ్గించనున్నారని చెబుతున్నారు. కేంద్రం హఠాత్తుగా ఇలా తాయిలాలు ప్రకటించడం వెనుక భారీ వ్యూహం ఉందంటున్నారు. ఆ వ్యూహమే ముందస్తు సార్వత్రిక ఎన్నికలు అంటున్నారు. ఎటూ ఈ ఏడాది చివరిలో ఐదు రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికలు జరగాల్సి ఉంది. అలాగే వచ్చే ఏడాది ప్రథమార్థంలో సార్వత్రిక ఎన్నికలు జరగాల్సి ఉంది. సార్వత్రిక ఎన్నికలతో పాటు ఏపీ, ఒడిశా వంటి కొన్ని రాష్ట్రాల అసెంబ్లీలకూ ఎన్నికలు జరగాల్సి ఉంది. దేశంలోని ప్రధాన పార్టీలన్నీ వచ్చే సార్వత్రిక ఎన్నికలకు లిట్మస్ టెస్ట్ గా భావిస్తున్న ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలపై దృష్టి కేంద్రీకరించి ఉన్నాయి. ఈ ఎన్నికలలో మెరుగైన ఫలితాలు సాధించి సార్వత్రిక ఎన్నికలకు బలంగా, ఘనంగా సమాయత్తం కావాలన్న ఆలోచనలో ఉన్నాయి. అదే సమయంలో విపక్షాల ఐక్యతా యత్నాలు కూడా సవ్య దిశలో సాగుతున్నాయి. బీజేపీలో ఓటమి భయం ప్రస్ఫుటంగా కనిపిస్తున్నది. అందుకే ముందస్తు సార్వత్రిక ఎన్నికల గురించి ఆలోచిస్తున్నది. ఒకే దెబ్బకు రెండు పిట్టలన్నట్లుగా ఇటు అసెంబ్లీ ఎన్నికలు, అటు సార్వత్రిక ఎన్నికలూ ఒకే సారి జరిపిస్తే.. మొత్తం ఎన్నికలను జాతీయ అంశాలు ప్రభావితం చేస్తాయనీ, తద్వారా జాతీయ అంశాలు, కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలూ మరుగున పడతాయని మోడీ భావిస్తున్నట్లుగా పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. పనిలో పనిగా గత తొమ్మిదేళ్లుగా కేంద్రంలోని మోడీ సర్కార్ ప్రతిపాదిస్తున్న జమిలి ప్రయోగం కూడా కానిచ్చేసినట్లౌతుందన్నది మోడీ యోచనగా చెబుతున్నారు. అందుకే ఈ ఏడాది చివరిలో జరగనున్న ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలతో పాటు లోక్ సభ ఎన్నికలను కూడా జరిపించేస్తే రాజకీయంగా లబ్ధి పొందే అవకాశాలు మెండుగా ఉంటాయన్నది మోడీ యోచనగా చెబుతున్నారు. పనిలో పనిగా తాము ఏం చెబితే అది చేయడానికి ఎవరెడీ బ్యాటరీలా సదా సిద్ధంగా ఉండే వైసీపీ, బీజేడీ ప్రభుత్వాలను ఒప్పించి ఆయా రాష్ట్రల అసెంబ్లీ ఎన్నికలు కూడా కానిచ్చేస్తే వీటినే మినీ జమిలి ఎన్నికలని ఘనంగా చాటుకుని చేసి చూపించామన్న ఘనతను ఖాతాలో వేసుకోవచ్చన్నది మోడీ యోచనగా పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. కేంద్రంలోని బీజేపీ సర్కార్ విపక్షాలు గుక్క తిప్పుకునే అవకాశం ఈయకుండా వరుస పెట్టి తాయిలాలు ప్రకటిస్తూ వేగంగా ఎన్నికలకు సమాయత్తమైపోతున్నదంటున్నారు. అంటే నిర్దిష్ట గడువుకంటే మూడు నుంచి నాలుగు నెలలు ముందుగానే సార్వత్రిక ఎన్నికలు జరిగేలా మోడీ సర్కార్ ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందంటున్నారు. లోక్‌సభను రద్దుచేసి డిసెంబర్‌లో తెలంగాణ సహా ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలతో కలిపి ముందుస్తుకు వెళ్లేందుకు అవసరమైన సన్నాహకాలన్నీ కేంద్రంలోని మోడీ సర్కార్ చాపకింద నీరులా కానిచ్చేస్తోందని అంటున్నారు. ఏపీ, ఒడిషాల అసెంబ్లీ ఎన్నికలు కూడా ముందస్తుగానే జరిపించేయాలని భావిస్తోందంటున్నారు. విపక్షాల ఐక్యతా యత్నాలు ఫలించేందుకు వీలుగా అవి సమగ్రంగా చర్చించుకునేందుకు, సీట్ల సర్దుబాటుపై అవగాహనకు వచ్చేందుకు సమయం లేకుండా ఎన్నికల యుద్ధానికి శంఖారావం పూరించేసి ప్రయోజనం పొందాలన్నది మోడీ సర్కార్ యోచనగా చెబుతున్నారుఏపీ, ఒడిషాల్లో కూడా రిటర్నింగ్ ఆఫీసర్లను కూడా నియమించారు. మొత్తంగా కేంద్రం... నిర్ణయం తీసుకుంటే అధికారింగా ఎన్నికల ప్రక్రియ ప్రారంభమయింది. డిసెంబర్ లేదా జనవరి మొదటి వారంలో పోలింగ్ ప్రక్రియను పూర్తి చేసే అవకాశం ఉందని భావిస్తున్నారు.





## రజక సంఘం ఆత్మీయ సమ్మేళనం


**జయభేరి, కాప్రా :**
జమ్మిగడ్డ రజక సంఘం అధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం లో ముఖ్య అతిథిగా హాజరైన ఉప్పల్ నియోజకవర్గ BRS పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి. ఈ కార్యక్రమంలో తొలి MBC మాజీ చైర్మెన్ తాడూరి శ్రీనివాస్, పెద్దాపురం కుమార స్వామి, యాకయ్య, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.



**దేవరయంజల్ జెన్వి కన్వెన్షన్ లో జరిగిన కామారెడ్డి ఎమ్మెల్యే గంప గోవర్ధన్ కుమారుడు శశాంక్ సుప్రియ వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన ఉప్పల్ నియోజకవర్గ BRS పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి.**
**- జయభేరి, కాప్రా**

# ఏపీలో ముందస్తు ఎన్నికలు.. ఢిల్లీ సంకేతాలు
# పొత్తులపై ఎఫెక్ట్..!?

**కేంద్రంలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి**
**ఢిల్లీ పరిణామాలతో అమరావతిలో లెక్కలు మారుతున్నాయి**



ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల సమయంలో తీసుకొనే నిర్ణయాలు ఏపీ రాజకీయలపైన ప్రభావం చూపటం ఖాయంగా కనిపిస్తోంది. తాజాగా అందుతున్న సంకేతాలతో డిసెంబర్ జనవరిలోనే లోక్ సభకు ఎన్నికలు జరుగే అవకాశం ఉంది. అదే జరిగితే ఏపీ ఎన్నికలు అప్పుడే జరగున్నాయి. పొత్తులు ఎత్తులు కొత్త టర్న్ తీసుకోనున్నాయి.

**పార్లమెంట్ సమావేశాల్లో నిర్ణయం:**
ఈ నెల 18వ తేదీ నుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు జరగనున్నాయి. ఈ మేరకు అధికారికంగా బులెటిన్ విడుదల అయింది. ఈ సమావేశాల్లోనూ జమిలి ఎన్నికల బిల్లు తీసుకొస్తారని ప్రచారం సాగుతోంది. ఆ బిల్లు ఆమోదం వెంటనే సాధ్యమేనా అనే చర్చ మొదలైంది. ఇదే సమయంలో లోక్ సభకు ముందస్తు ఎన్నికలపైన కేంద్రం నుంచి స్పష్టమైన సంకేతాలు అందుతున్నాయి. రామ్‌నాథ్ కోవింద్ కమిటీని నియమించిన కేంద్రం,విధి విధానాలు ఖరారు చేసింది. పార్లమెంట్ సమావేశాల్లో జమిలి ఎన్నికల దిశగా కావాల్సిన ఐదు రాజ్యాంగ సవరణలు చేయడం.. సగం రాష్ట్రాల ఆమోదం పొందడమూ సులువు కాదనే వాదన ఉంది. దాంతో, దశలవారీగా ఈ ఆలోచనను అమలు చేయాలని కోవింద్ కమిటీ ద్వారా ప్రభుత్వం నివేదిక తెప్పించుకునే అవకాశముందని చెబుతున్నారు.

**లోక్ సభతో పాటుగా ఏపీ ఎన్నికలు:**
ఈ డిసెంబరు నుంచి వచ్చే డిసెంబరు మధ్యలో ఎన్నికలు జరగాల్సిన పది నుంచి 12 రాష్ట్రాల అసెంబ్లీలు, లోక్‌సభకు కలిపి పాక్షిక జమిలి ఎన్నికలు జరిపే విధంగా పావులు కదుపు తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ ఏడాది నవంబరుడిసెంబరులో మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్ గఢ్, తెలంగాణ, మిజోరాం రాష్ట్రాల ఎన్నికలు జరగాల్సి ఉండగా, వచ్చే ఏడాది మే డిసెంబరు మధ్య ఆంధ్రపదేశ్, అరుణాచల్‌ప్రదేశ్, ఒడిసా, సిక్కిం, హరియాణ, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉంది. వచ్చే ఏడాది మేడిసెంబరు మధ్య ఎన్నికలు జరపాల్సిన అసెంబ్లీలకు ముందస్తుకు సంబంధించి పెద్దగా ఇబ్బందులుండవని చెబుతున్నారు. నిబంధనల ప్రకారం ఆరు నెలల ముందు ఎప్పుడైనా ఎన్నికలు నిర్వహించవచ్చు. కానీ, ఈ ఏడాది నవంబరు డిసెంబరుల్లో ఎన్నికలు జరగాల్సిన అసెంబ్లీలకు సంబంధించి సమస్య ఉత్పన్నమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

**మారుతున్న రాజకీయ లెక్కలు:**
ఈ నేపథ్యంలో, లోక్‌సభతోపాటు పది, 12 రాష్ట్రాల అసెంబ్లీలకు డిసెంబరు జనవరిల్లోనే ఎన్నికలు జరిపేలా కేంద్రం పావులు కదుపుతోందని సమాచారం.
అదే జరిగితే ఏపీలోనూ డిసెంబర్ జనవరిలోనే ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. సీఎం జగన్ ఒంటరి పోరుకు సిద్దం కావటంతో తాము ఎన్నికలు వచ్చినా రెడీగా ఉన్నామని వైసీపీ చెబుతోంది.
ఇదే సమయంలో పార్లమెంట్ లో కేంద్రం తీసుకొచ్చే ప్రతిష్ఠాత్మక బిల్లుల ఆమోదంలో వైసీపీ పాత్ర కీలకం కానుంది. దీంతో, అటు వైసీపీని కాదని ఇప్పటికిప్పుడు పొత్తుల కోసం టీడీపీతో బీజేపీ చేతులు కలుపుతుందా అనేది సందేహమే.



**ప్రతిభ గ్రూప్ ఆఫ్ స్కూల్ అధినేత మామిడి సుధాకర్ రెడ్డి 60 వ పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొన్న ఉప్పల్ నియోజకవర్గ BRS పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి.**
**- జయభేరి, ఉప్పల్**




## నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం

**జయభేరి, కాప్రా :**
ఆర్యవైశ్య సంఘం మీర్ పేట్ HB కాలనీ మౌలాలి నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన ఉప్పల్ నియోజకవర్గ BRS పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘం ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



**గంగపుత్ర సంఘం ఆద్వర్యంలో సఫిల్ గూడ చెరువు వద్ద నిర్వహిస్తున్న తెప్పోత్సవం, బోనాల ఊరేగింపులో పాల్గొని గంగపుత్ర సోదరులకు, వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేసిన ఉప్పల్ నియోజకవర్గ BRS పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి.**
**- జయభేరి, కాప్రా**



## మేరు బ్యాట్మెంటన్ టోర్నమెంట్ ప్రారంభించిన బండారి లక్ష్మారెడ్డి

**జయభేరి, ఉప్పల్ :**
ఉప్పల్ విజయపురి కాలనీలో గోవర్ధన్ అకాడమీలో తెలంగాణ మేరు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన మీరు బ్యాట్మెంటన్ టోర్నమెంట్ ప్రారంభించిన ఉప్పల్ నియోజకవర్గ BRS పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇలాంటి టోర్నమెంట్ ల ద్వారా మానసిక ఒత్తిడి తగ్గిస్తాయి అని ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్న మేరు సంఘం వారికి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ నిర్వాహకులు మేరు సంఘం అధ్యక్షుడు కరుణాకర్, నిర్వాహకులు అరుణ్ కుమార్, రమేశ్, చంద్రకాంత్ శ్రావణ్ కుమార్, ధరణి, గిరిధర్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.





## రామ్ రెడ్డి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆత్మీయ సమ్మేళనం

**జయభేరి, ఉప్పల్ :**
రామంతపూర్ డివిజన్ రామ్ రెడ్డి నగర్ లో రామ్ రెడ్డి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో పాల్గొన్న ఉప్పల్ నియోజకవర్గ BRS పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని BLR దృష్టికి తీసుకెళ్లగా వారి పరిష్కార దిశగా కృషి చేస్తా అని హామీ ఇచ్చారు. సమావేశం అనంతరం ఉప్పల్ నియోజకవర్గ BRS పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి ని కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం లో BRS రాష్ట్ర నాయకులు గంధం నాగేశ్వర్ రావు, సత్యనారాయణ గౌడ్, వెంకన్న, సాగర్, నర్సింహా రెడ్డి, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.



# 'ఇది అదేరా' చంద్రముఖి 2 హర్రర్.. కామెడీతో ఆసక్తికరంగా..

ప్రముఖ కొరియోగ్రాఫర్, నటుడు రాఘవ లారెన్స్, బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కంగనా రనౌత్ ప్రధాన పాత్రల్లో నటించిన చంద్రముఖి2 సినిమాపై చాలా హైప్ ఉంది. హర్రర్ కామెడీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు దర్శకుడు పి.వాసు. 18 ఏళ్ల క్రితం రిలీజై సంచలన విజయం సాధించిన చంద్రముఖి చిత్రానికి సీక్వెల్‌గా వస్తుడటంతో చంద్రముఖి 2పై భారీ అంచనాలు ఉన్నాయి. ఇప్పటికే మంచి బజ్ ఏర్పడింది. కాగా, నేడు (సెప్టెంబర్ 3) చంద్రముఖి 2 చిత్రం ట్రైలర్ రిలీజ్ అయింది. ట్రైలర్ ఎలా ఉందంటే..
చంద్రముఖి సినిమా చివర్లో భవనం నుంచి బయటికి వెళ్లే పాముతోనే చంద్రముఖి2 ట్రైలర్ మొదలైంది. ఆ తర్వాత ప్రస్తుతం కాలంలో రాఘవ లారెన్స్ ఫైట్ ఉంది. రాధికా శరత్ కుమార్ కుటుంబం ఓ భవనంలోకి వెళ్లడం, దాంట్లో చంద్రముఖి ఆత్మ ఉందన్న విషయం చంద్రముఖి2 ట్రైలర్‌లో తెలుస్తోంది. స్టార్ కమెడియన్ వడివేలు ఆ భవనంలో భయపడుతూ ఉంటారు. 'ఇది అదేరా' అని చంద్రముఖి మళ్లీ వచ్చిందని భయపడతారు వడివేలు. చంద్రముఖిగా కంగనా రనౌత్ చక్కగా సూటయ్యారు. ఈ ట్రైలర్‌లో ఆమె కానిపించేది కాసేపే. ఇక ఫ్లాష్‌బ్యాక్‌లో రాఘవా లారెన్స్ వెట్టయరాజగా కనిపిస్తారు. చాలా సంత్సరాలుగా చంద్రముఖికి, వెట్టయరాజాకు పగ ఉన్నట్టు ట్రైలర్లో ఉంది. చంద్రముఖి2 ట్రైలర్ చివర్లో ఓ యుద్ధం సీక్వెన్స్ కూడా ఉంది. ఆస్కార్ అవార్డు విన్నర్, దిగ్గజ మ్యూజిక్ డైరెక్టర్ ఎంఎం కీరవాణి అందించిన బ్యాక్‌గ్రౌండ్.. ఈ ట్రైలర్‌కు మరో బలంగా ఉంది. చంద్రముఖి2 ట్రైలర్ ఇంట్రెస్టింగ్‌గానే ఉన్నా.. మొత్తంగా చూస్తే చంద్రముఖిలానే ఈ చిత్రం ఉంటుందనిపిస్తోంది. కథ, కథనం కూడా అలాగే సాగేలా అనిపిస్తోంది. దర్శకుడు పి.వాసు వైవిధ్యాన్ని ఎలా చూపిస్తారో వేచిచూడాలి. సూపర్ స్టార్ రజీనికాంత్ నటించిన చంద్రముఖి సినిమా 2005లో సూపర్ హిట్ అయింది. ఇప్పుడు చంద్రముఖి 2లో హీరోగా రాఘవ లారెన్స్ చేశారు. కాగా, ప్రస్తుతం చంద్రముఖి2 ట్రైలర్ తమిళంలో రిలీజ్ కాగా.. అతిత్వరలోనే తెలుగులో అందుబాటులోకి రానుంది. ఈనెల 15వ తేదీన తమిళంతో పాటు తెలుగు, హిందీ, కన్నడ, మలయాళం భాషల్లో చంద్రముఖి2 థియేటర్లలో రిలీజ్ కానుంది. ఈ సినిమాలో వడివేలు, రాధికా శరత్ కుమార్, లక్ష్మీ మీనన్, మహిమా నంబియార్, రావురమేశ్ కీలకపాత్రలు పోషించారు. లైకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సుభాస్కరన్ ఈ చిత్రాన్ని నిర్మించారు.

# ధుమ్ములేపుతున్న ఖుషి కలెక్షన్స్

## 2 రోజుల్లోనే అన్ని కోట్లు.. లాభాలు రావాలంటే?

తెలుగు చిత్ర పరిశ్రమలో రౌడీ హీరోగా ముద్ర వేసుకున్న విజయ్ దేవరకొండ లైగర్ మూవీ తర్వాత ఖుషి సినిమాతో మంచి హిట్ కొట్టాడు. ఈ సినిమాకు తెలుగు ప్రేక్షకులు భారీగా తరలివెళ్తున్న నేపథ్యంలో ఖుషి 2వ రోజు కలెక్షన్స్ వివరాలు ఎలా ఉన్నాయో ఓ లుక్కేద్దాం. స్టార్ హీరోయిన్ సమంత, విజయ్ దేవరకొండ కలిసి నటించిన లేటెస్ట్ మూవీ ఖుషి. ఫీల్ గుడ్ చిత్రాల దర్శకుడు శివ నిర్వాణ తెరెకెక్కించిన ఈ సినిమా ముందు నుంచే మంచి అంచనాలు క్రియేట్ చేసింది. ఇక సినిమాలోని పాటలకు మంచి రెస్పాన్స్ వచ్చింది. హేషమ్ అబ్దుల్ వహాద్ స్వరపరిచిన పాటలు యువత హమ్ చేసేలా ఉన్నాయి. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, యలమంచిలి రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా సెప్టెంబర్ 1న ప్రపంచవ్యాప్తంగా విడుదలై సక్సెస్ ట్రాక్ ఎక్కుతోంది. విజయ్ దేవరకొండ, సమంత మార్కెట్‌కు తగినట్లుగానే ఖుషి ప్రీ రిలీజ్ బిజినెస్ జరిగింది. ఖుషి సినిమాకు తెలంగాణలోని నైజాంలో రూ. 15 కోట్లు, సీడెడ్‌లో 6 కోట్లు బిజినెస్ కాగా ఆంధ్రప్రదేశ్‌లో రూ. 20 కోట్ల వరకు ప్రీ రిలీజ్ బిజినెస్ అయింది. ఇలా తెలుగు రాష్ట్రాల్లో మొత్తంగా రూ. 41 కోట్ల మార్కెట్ జరిగింది. ఇక కర్నాటకతోపాటు రెస్టాఫ్ ఇండియాలో రూ. 4.50 కోట్లు, ఓవర్సీస్‌లో రూ. 7 కోట్లు అయింది. ఖుషికి వరల్డ్ వైడ్‌గా 52.50 కోట్ల ప్రీ రిలీజ్ జరిగిందని లెక్కలు చెబుతున్నాయి. ఖుషి సినిమాకు 2వ రోజున నైజాంలో రూ. 3.30 కోట్లు, సీడెడ్‌లో రూ. 43 లక్షలు, ఉత్తరాంధ్రలో రూ. 56 లక్షలు, ఈస్ట్ గోదావరిలో రూ. 26 లక్షలు, వెస్ట్ గోదావరిలో రూ. 15 లక్షలు, గుంటూరులో రూ. 27 లక్షలు, కృష్ణాలో రూ. 26 లక్షలు, నెల్లూరులో రూ. 13 లక్షలు కలెక్షన్స్ వచ్చాయి. మొత్తంగా రూ. 5.36 కోట్ల షేర్, రూ. 9.05 కోట్ల గ్రాస్ వసూళ్లు వచ్చాయి. సమంత ఖుషి మూవీ 2 రోజుల్లో తెలుగు రాష్ట్రాల్లోని నైజాంలో రూ. 8.45 కోట్లు, సీడెడ్‌లో రూ. 1.34 కోట్లు, ఉత్తరాంధ్రలో రూ. 1.69 కోట్లు, ఈస్ట్ గోదావరిలో రూ. 92 లక్షలు, వెస్ట్ గోదావరిలో రూ. 78 లక్షలు, గుంటూరులో రూ. 93 లక్షలు, కృష్ణాలో రూ. 70 లక్షలు, నెల్లూరులో రూ. 42 లక్షల బాక్సాఫీస్ వసూళ్లు సాధించింది. ఇలా 2 రోజులకు కలిపి ఏపి, తెలంగాణలో రూ. 15.23 కోట్లు షేర్, రూ. 24.90 కోట్ల గ్రాస్ వచ్చింది. ఇక ఖుషి సినిమాకు కర్ణాటక ప్లస్ రెస్టాఫ్ ఇండియాలో రూ. 1.60 కోట్లు, ఓవర్సీస్‌లో రూ. 5.95 కోట్లు వచ్చాయి. అలాగే ప్రపంచవ్యాప్తంగా 2 రోజులకు రూ. 23.83 కోట్ల షేర్, రూ. 51 కోట్ల గ్రాస్ కలెక్షన్స్ వచ్చినట్లు సమాచారం. అయితే ఖుషి చిత్రానికి వరల్డ్ వైడ్‌గా రూ. 52.50 కోట్ల బిజినెస్ జరగ్గా.. రూ. 53.50 కోట్లుగా ఫిక్స్ అయింది. ఖుషికి రెండు రోజులకు రూ. 23.83 కోట్లు వచ్చాయి కనుక ఇంకా రూ. 29.67 కోట్లు వస్తే బ్రేక్ ఈవెన్ టార్గెట్ పూర్తయి లాభాలు అందుకునే అవకాశం ఉంది.



# శ్రీలీల ఇంట్రెస్టింగ్ కామెంట్స్


ఇటీవల విడుదలైన బాలకృష్ణ 'భగవంత్ కేసరి' సినిమా తొలి పాటలో బాబాయ్, కూతుళ్లుగా బాలకృష్ణ, శ్రీలీలా చేసిన హంగామా మామూలుగా లేదు. అభిమానులు కూడా ఆ పాటలో బాలకృష్ణ లుక్‌కీ, శ్రీలీల జోష్‌కీ ఫిదా అయిపోతున్నారు. ఇటీవల ఓ సందర్భంలో 'భగవంత్ కేసరి' విశేషాలను, బాలకృష్ణతో తన అనుభవాలను పంచుకున్నారు శ్రీలీల. సాటి నటులకు బాలకృష్ణ ఇచ్చే గౌరవం చూసి ఫిదా అయిపోయానని శ్రీలీల అన్నారు. ఇందులో మా పాత్రల గురించి రివీల్ చేయడం నాకిష్టంలేదు. అయితే.. ఈ సినిమా చేస్తున్నంతసేపు ఆయన నాకు సొంత బాబాయ్‌లాగే అనిపించారు. ఆయనకూడా లొకేషన్లో నన్ను అలాగే చూసుకున్నారు. మరో అవకాశం వస్తే మళ్లీ బాలయ్య సార్‌తో చేయాలనుంది." అంటూ భావోద్వేగానికి లోనయ్యారు శ్రీలీల.





# శంకర్ దేన్ని ముందు రిలీజ్ చేస్తాడు?

రామ్‌చరణ్ కెరీర్‌లో గొప్ప పాత్రలంటే మగధీర, రంగస్థలం, ఆర్‌ఆర్‌ఆర్ సినిమాలు చెప్పుకుంటాం. త్వరలో ఆ వరుసలో 'గేమ్‌ఛేంజర్' కూడా చేరబోతున్నదని తెలుస్తోంది. మగధీర తర్వాత మళ్లీ ఈ సినిమాలో రామ్‌చరణ్ ద్విపాత్రాభినయం చేస్తున్నారు. అటు రామ్‌చరణ్, ఇటు దిల్‌రాజు ఇద్దరి కెరీర్లలోనూ హై బడ్జెట్ సినిమాగా 'గేమ్‌ఛేంజర్' రూపొందుతున్నది. ఇందులోని కథాకథనాలు ప్రేక్షకుల ఊహలకు అందని స్థాయిలో ఉంటాయని వినికిడి. దక్షిణాది అగ్ర దర్శకుడైన శంకర్ దర్శకత్వంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న ఈ సినిమా షూటింగ్ 50శాతం పూర్తికావచ్చిందనేది విశ్వసనీయవర్గాల సమాచారం. ఈ సినిమాతోపాటు కమల్‌హాసన్ 'ఇండియన్ 2' సినిమాకు కూడా శంకర్ దర్శకత్వం వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ రెండు సినిమాల్లో ఏది ముందు విడుదల అవుతుందనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న. రెండింటిపై భారీ అంచనాలుండటం విశేషం.



# మ్యారేజిపై తమన్నా షాకింగ్ కామెంట్స్

మూడుపదుల వయసు దాటినా వన్నెతరగని అందంతో అలరారుతున్నది అగ్ర కథానాయిక తమన్నా. ఇటీవలే ఈ భామ చిత్రసీమలో 18ఏండ్ల ప్రయాణాన్ని పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తన వ్యక్తిగత జీవితం తాలూకు ఆసక్తికరమైన విషయాలను పంచుకుంది. బాలీవుడ్ నటుడు విజయ్‌వర్మతో ఈ అమ్మడు గత కొంతకాలంగా ప్రేమాయణాన్ని సాగిస్తున్న విషయం తెలిసిందే. ఇటీవలే ఈ ప్రేమజంట మాల్దీవుల్లో విహార యాత్రకు వెళ్లొచ్చారు. అయితే విజయ్‌వర్మతో తన ప్రేమాయణం గురించి ఇప్పటివరకు ఎక్కడా పెదవి విప్పలేదు తమన్నా. మీడియా సమావేశాల్లో సైతం తన లవ్ ఎఫైర్‌పై ఎదురయ్యే ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా సున్నితంగా తిరస్కరిస్తుంటుంది. ఈ సందర్భంగా పెళ్లి గురించి తమన్నా మాట్లాడుతూ 'భారతీయ వివాహ వ్యవస్థపై నాకు పూర్తి నమ్మకం ఉంది. కొన్నాళ్ల క్రితమే వివాహం చేసుకోవాలనుకున్నా. కెరీర్‌లో బిజీగా మారడంతో పెళ్లి ఆలోచనలకు ఫుల్‌స్టాఫ్ పెట్టాను. ప్రస్తుతం భారీ సినిమాల్లో అవకాశాలు దక్కుతున్నాయి. నా పెళ్లి ముచ్చట వినాలంటే చాలా రోజులు వేచి చూడాల్సిందే' అని చెప్పుకొచ్చింది.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Publishedat # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com